క్లుప్తంగా

ప్లాస్టిక్ నిషేధానికి సహకరించాలి


తనిఖీ చేస్తున్న కమిషనర్ మల్లికార్జునస్వామి

మంథని: ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా తగ్గించాలని, సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధానికి ప్రతి ఒక్కరూ సహకరించాలని మున్సిపల్ కమిషనర్ గుట్టల మల్లికార్జునస్వామి కోరారు. గురువారం పట్టణంలోని పలు దుకాణాల్లో తనిఖీలు నిర్వహించారు. ప్లాస్టిక్ కవర్లు వాడుతున్న దుకాణదారులకు జరిమానా విధించారు. 120మైక్రాన్ల కన్నా కంటే తక్కువ ఉన్న ప్లాస్టిక్ కవర్లను వాడడం నిషేధమని దుకాణదారులకు వివరించారు. ప్లాస్టిక్ వినియోగం పెరగడంతో అనేక సమస్యలు ఉత్పన్నమవుతున్నాయని, ప్లాస్టిక్ వినియోగాన్ని పూర్తిగా తగ్గించుకోవాలని సూచించారు. చట్ట వ్యతిరేకంగా ప్లాస్టిక్ కవర్లు అమ్మినా, వాడినా జరిమానా విధించడంతో పాటు చట్టపరమైన శిక్షలు ఉంటాయన్నారు. ప్రజలు మార్కెట్లకు వెళ్లేటప్పుడు జౌళి సంచులను తీసుకెళ్లాలని సూచించారు. వార్డు ఆఫీసర్స్, మున్సిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

ముమ్మరంగా వాహనాల తనిఖీ


వాహనాన్ని తనిఖీ చేస్తున్న పోలీసులు

రామగుండం: పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ప్రధాన కూడళ్లతో పాటు జిల్లా సరిహద్దుల్లో పోలీసులు ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి వాహనాలను ముమ్మరంగా తనిఖీ చేస్తున్నారు. ఇందులో భాగంగానే గురువారం అంతర్గాం మండల పరిధిలోని ఎల్లంపల్లి ప్రాజెక్టు గేటు వద్ద జిల్లా సరిహద్దు కావడంతో పోలీసులు ప్రత్యేక చెక్‌పోస్టు ఏర్పాటు చేసి వాహనాలను తనిఖీ చేసి పంపిస్తున్నారు. అంతర్గాం ఎస్సై బోయ వెంకట్ ఎప్పటికప్పుడు వాహనాలపై ప్రత్యేక దృష్టిసారిస్తున్నారు.

రెండో డివిజన్‌లో పారిశుధ్య పనులు


కాలువను శుభ్రం చేస్తున్న పారిశుధ్య కార్మికులు

జ్యోతినగర్: రామగుండం కార్పొరేషన్ రెండో డివిజన్ పీకే రామయ్యకాలనీలో మున్సిపల్ పారిశుధ్య విభాగం ఆధ్వర్యంలో డ్రైనేజీ క్లీన్ చేసే కార్యక్రమాన్ని గురువారం చేపట్టారు. డివిజన్‌లో డ్రైనేజీ శుభ్రం చేయకపోవడంతో నీరు నిలిచి ప్రజలు ఇబ్బంది పడుతున్నారని కాంగ్రెస్ నాయకుడు మడిపెల్లి మల్లేశ్ ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యే స్పందించి మున్సిపల్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. మడిపెల్లి మల్లేశ్ మాట్లాడుతూ గత పాలకుల నిర్లక్ష్యంతో పదేళ్ల నుంచి డ్రైనేజీ కాలువలు తీయకపోవడంతో కాలువలు మొత్తం నిండిపోయి దుర్వాసనతో కాలనీ ప్రజలు అనారోగ్యాలు గురవుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రజల ఇబ్బందులను విన్నవించిన వెంటనే స్పందించిన ఎమ్మెల్యేకు కాలనీవాసులతో పాటు ఆయన కృతజ్ఞతలు తెలియజేస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో గౌరదీప్, కుమార్ నాయక్ ఉన్నారు.

సమస్యల పరిష్కారానికి చర్యలు


చెత్తను తీసివేస్తున్న చైర్‌పర్సన్ గాజుల లక్ష్మి

సుల్తానాబాద్: వార్డుల్లోని సమస్యలను పరిష్కరించేందుకు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నట్లు మున్సిపల్ చైర్‌పర్సన్ గాజుల లక్ష్మి పేర్కొన్నారు. గురువారం మున్సిపల్ పరిధిలోని యాదవ్‌నగర్‌లో పరిసరాలను పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజలు డ్రైనేజీల్లో ప్లాస్టిక్ కవర్లు, వస్తువులను వేయొద్దని, కాలనీలు శుభ్రంగా ఉంటే ఎలాంటి రోగాలు దరిచేరవని, ప్రతిఒక్కరూ విధిగా తడి, పొడి చెత్తను వేరుచేసి మున్సిపల్ వాహనం వచ్చినప్పుడు సిబ్బందికి అందించాలని స్వచ్ఛ మున్సిపల్‌గా మారుతుందన్నారు. అనంతరం ఇంటింటా తిరుగుతూ సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కౌన్సిలర్ కూకట్ల గోపి, నాయకులు గాజుల రాజమల్లు, కాలనీవాసులు ఉన్నారు.

ముగిసిన లెప్రసీ సర్వే.. తేలిన లెక్క

- అనుమానితుల గుర్తింపు
- తొమ్మిది మందికి కుష్ఠువ్యాధి సోకినట్లు నిర్ధారణ
- ఈనెల 11వ తేదీ నుంచి 24 వరకు సర్వే నిర్వహించిన వైద్యారోగ్యశాఖ


అనుమానితులను పరిశీలిస్తున్న సూపర్‌వైజర్లు

సుల్తానాబాద్/ఎలిగేడు: కుష్ఠురహిత(లెప్రసీ) సమాజంగా మార్చేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు కార్యక్రమాలు అమలు చేస్తున్నాయి. 2030 వరకల్లా దేశంలో కుష్ఠువ్యాధిని పూర్తిగా నిర్మూలించాలని కేంద్ర ప్రభుత్వం నిర్దేశించింది. ఈ క్రమంలోనే జిల్లాలో ప్రత్యేక కార్యక్రమాలు చేపడుతున్నా కేసులు పెరగడం ఆందోళన కలిగిస్తోంది. ఇప్పటికి 820 అనుమానితులలో తొమ్మిది కేసులను గుర్తించినట్లు అధికారులు తెలిపారు. ఈనెల 11 నుంచి 24 వరకు వైద్యారోగ్యశాఖ సిబ్బంది ఇంటింటా లెప్రసీ సర్వే నిర్వహించగా వైద్య ఆరోగ్య శాఖ డాక్టర్లు అనుమానితులకు పరీక్ష చేసే కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు లెప్రసీ జిల్లా ఇన్‌చార్జి జయకర్ తెలిపారు. జిల్లా వైద్యారోగ్యశాఖ గ్రామ, పట్టణాల్లో ప్రత్యేకంగా సర్వే నిర్వహించింది.

అనుమానితుల గుర్తింపు

లెప్రసీ వ్యాధి అనుమానితులను గుర్తించేందుకు వైద్యారోగ్యశాఖ చేపట్టిన ప్రత్యేక సర్వేలో 20మందికి వ్యాధి నిర్ధారణ అయింది. జిల్లావ్యాప్తంగా 8 అర్బన్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, 18 ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు ఉన్నాయి. 247 మంది ఏఎన్‌ఎంలు, 495 మంది ఆశావర్కర్లు, 107 మంది సూపర్‌వైజర్లు సర్వే చేపట్టారు. జిల్లాలో 1,99,877 మంది ఇళ్లను సందర్శించారు. పీహెచ్‌సీ పరిధిలోని అన్ని గ్రామాల్లో సర్వే పూర్తి చేసి 1198 మంది అనుమానితులను గుర్తించారు. పరీక్షలు నిర్వహించగా 9మందికి వ్యాధి సోకినట్లు నిర్ధారణ అయింది. వ్యాధిపై అవగాహన లేకపోవడం, వ్యక్తిగత శుభ్రత పాటించకపోవడంతో ఎక్కువగా కార్మికుల్లో వ్యాప్తి ఎక్కువగా ఉంది. జిల్లాలో 2020–22 వరకు 20 కేసులు నమోదయ్యాయి. 2022 నుంచి 2024 ఇప్పటివరకు 72 కేసులు నమోదు కాగా మరిన్ని పెరిగే అవకాశాలున్నాయని వైద్యాధికారులు చెప్తున్నారు.

అందుబాటులో వైద్యసేవలు



ప్రతి ఏడాది అనుమానితులను గుర్తించి పరీక్షలు నిర్వహిస్తున్నాం. వ్యాధి వ్యాప్తి జరగకుండా ప్రాథమిక దశలో గుర్తించి, నియంత్రణకు కావాల్సిన పరీక్షలు నిర్వహిస్తూ ఉచితంగా మందులు అందజేస్తున్నాం. పరీక్షలు నిర్వహించి వ్యాధి నిర్ధారణ అయినవారికి మందులు పంపిణీ చేస్తున్నం. కోలుకునేందుకు కావాల్సిన వైద్య సేవలు అందుబాటులో ఉన్నాయి.
– ప్రమోద్‌కుమార్, జిల్లా వైద్యాధికారి, పెద్దపల్లి

ప్రధాన డ్రైనేజీని పరిశీలించిన కమిషనర్

సాక్షి ఎఫెక్ట్..


డ్రైనేజీని పరిశీలిస్తున్న కమిషనర్ శ్రీకాంత్

రామగుండం: పట్టణంలోని ప్రధాన డ్రైనేజీ తరచూ మురుగు నీటితో ముంచెత్తుతోంది. ఈ మేరకు 'ముంచెత్తుతున్న మురుగు' అనే శీర్షికతో 'సాక్షి'లో ప్రచురితమైన కథనంపై బల్దియా కమిషనర్ శ్రీకాంత్ స్పందించారు. గురువారం ఉదయం క్షేత్రస్థాయిలో ప్రధాన డ్రైనేజీని పరిశీలించారు. మున్సిపల్ శానిటరీ సూపర్‌వైజర్ ముదాం తిరుపతి పలు విషయాలను వెల్లడించారు. ముఖ్యంగా రహదారిపై ఉన్న వంతెనను కూల్చేసి ఎత్తులో నిర్మించాలని, డ్రైనేజీ పూర్తిగా శిథిలావస్థకు చేరడంతో మట్టి, పిచ్చిమొక్కలతో నీటి సరఫరాకు అడ్డంకిగా మారుతోందని, నూతన భూగర్భ డ్రైనేజీ నిర్మాణంతోనే సమస్యకు శాశ్వత పరిష్కారం లభిస్తుందని పేర్కొన్నారు. దీనిపై కమిషనర్ పూర్తిస్థాయిలో డ్రైనేజీలో నీటి ప్రవాహం, స్థానిక పరిసరాలను పరిశీలించి వివరాలను నమోదు చేసుకున్నారు.

మార్కండేయస్వామి కల్యాణ మహోత్సవం


పూజల్లో ప్రభుత్వ విప్ లక్ష్మణ్‌కుమార్, ఎంపీ అభ్యర్థి వంశీకృష్ణ

ధర్మారం: మండల కేంద్రంలోని శ్రీశివభక్తి మార్కండేయ స్వామి ప్రథమ వార్షికోత్సవ కల్యాణ మహోత్సవంలో ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్‌కుమార్‌తో కలిసి కాంగ్రెస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీకృష్ణ గురువారం పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ అర్చకులు, ఆలయ కమిటీ సభ్యులు స్వాగతం పలికారు. అనంతరం లక్ష్మణ్‌కుమార్, వంశీకృష్ణను సన్మానించారు. ఆలయ కమిటీ చైర్మన్ ఒడ్నాల శంకరయ్య, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు గాగిరెడ్డి తిరుపతిరెడ్డి, మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ కొత్త నర్సింహం, మాజీ వైస్ చైర్మన్‌లు కాడే సూర్యనారాయణ, పాలకుర్తి రాజేశంగౌడ్, నాయకులు దేవి జనార్దన్, కోమటిరెడ్డి దేవేందర్‌రెడ్డి, లావుడ్య రూప్లానాయక్, పాలకుర్తి రేణుకాదేవి, ఎల్లయ్య, స్వామి, లింగయ్య పాల్గొన్నారు.

మోదీతోనే అభివృద్ధి సాధ్యం


మాట్లాడుతున్న నాయకులు

సుల్తానాబాద్: ప్రధానమంత్రి నరేంద్ర మోదీతోనే అభివృద్ధి సాధ్యమవుతుందని నియోజకవర్గ ప్రభారి పోశం అన్నారు. గురువారం పట్టణంలోని శక్తి కేంద్రాల అధ్యక్షులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ, పట్టణాల్లో కేంద్ర ప్రభుత్వం కేటాయిస్తున్న నిధులతోనే అభివృద్ధి చెందుతున్నాయని, అది విస్తృత ప్రచారం చేయాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. పెద్దపల్లి అభ్యర్థి గోమాస శ్రీనివాస్ గెలిపించాలని పిలుపునిచ్చారు. దేశవ్యాప్తంగా శాంతిభద్రతలను కాపాడడంలో పార్టీ కీలకపాత్ర పోషిస్తుందన్నారు. పార్టీ పట్టణ అధ్యక్షుడు కూకట్ల నాగరాజు అధ్యక్షతన జరిగిన సమావేశంలో నాయకులు రాష్ట్ర కార్యవర్గ సభ్యులు శీలారపు పర్వతాలు, అసెంబ్లీ కన్వీనర్ దాడి సంతోష్, పార్లమెంట్ విస్తారక్ స్వామి, దళితమోర్చా కోకన్వీనర్ ఈర్ల శంకర్, జిల్లా మహిళా మోర్చా ఉపాధ్యక్షురాలు వనజ, పట్టణ మహిళా మోర్చా అధ్యక్షురాలు కూకట్ల చంద్రకళ, ఉపాధ్యక్షురాలు మాటూరి లత, కార్యదర్శులు పోచంపల్లి ఈశ్వర్, కందునూరి మనోహర్, కుమార్, రమేశ్, కుమార్, అమ్ముల కుమార్, గజబీంకార్ పవన్, తిరుపతి పాల్గొన్నారు.

బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా శ్రీరాములుగౌడ్ ఎన్నిక


ఎన్నికైన కమిటీతో అధ్యక్షుడు శ్రీరాములుగౌడ్

సుల్తానాబాద్: సుల్తానాబాద్ బార్ అసోసియేషన్ ఎన్నికలను బార్ అసోసియేషన్ కార్యాలయంలో నిర్వహించారు. గురువారం హోరాహోరీగా జరిగిన ఎన్నికల్లో 43 మంది న్యాయవాదులు ఓటుహక్కు వినియోగించుకున్నారు. అధ్యక్ష స్థానానికి ఆలూరి శ్రీనివాసరావు, పడాల శ్రీరాములు పోటీపడగా పడాల శ్రీరాములుకు 29 ఓట్లు వచ్చి విజయం సాధించినట్లు ఎన్నికల అధికారి పడాల అంజయ్య, సహాయ ఎన్నికల అధికారి నర్సయ్య ప్రకటించారు. ఉపాధ్యక్షుడిగా పెగడ శ్యాం సుందర్, ప్రధాన కార్యదర్శి పదవికి జోగుల రమేశ్ గెలుపొందారు. సంయుక్త కార్యదర్శిగా సామల రాజేంద్రప్రసాద్, కోశాధికారిగా చీకటి సంతోష్‌కుమార్, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ కార్యదర్శిగా వడ్లకొండ రవికిరణ్‌గౌడ్, లైబ్రరీ కార్యదర్శిగా ఆవుల శివకృష్ణ, మహిళా ప్రతినిధిగా పి.సంధ్యారాణి గౌడ్, సీనియర్ ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా లక్ష్మీరాజం, బాలకిషన్ ప్రసాద్, పబ్బతి లక్ష్మీకాంతరెడ్డి, అకారపు సరోత్తంరెడ్డి, వోడ్నాల రవీందర్, ఆవునూరి సత్యనారాయణ, జూనియర్ ఎగ్జిక్యూటివ్ మెంబర్లు మల్యాల కరుణాకర్‌గౌడ్, తాళ్లపల్లి లక్ష్మణ్, ఆరెల్లి రాములు, వంగల యుగందర్‌రెడ్డి, బొబ్బిలి శ్యాం, గుడ్ల వెంకటేశ్‌ను ఎన్నుకున్నారు.

సంక్షిప్త వార్తలు

ఇంటర్నల్ ఉద్యోగుల్లో దివ్యాంగులకు రిజర్వేషన్ కల్పించండి

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణి సంస్థలో చేపట్టిన ఇంటర్నల్ ఉద్యోగుల్లో దివ్యాంగులకు రిజర్వేషన్ కల్పించాలని ఏఐటీయూసీ నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఆర్జీ–2 ఏరియా ఏఐటీయూసీ కార్యాలయంలో నాయకులు రాజారత్నం, ఎల్.ప్రకాశ్ మాట్లాడారు. రాజ్యాంగబద్ధంగా ఉన్న 4శాతం రిజర్వేషన్లను దివ్యాంగులకు వెంటనే అమలు చేయాలని కోరారు. లేకుంటే ఆందోళన కార్యక్రమాలు చేపడతామన్నారు. బ్రాంచ్ కార్యదర్శి రవీందర్, అన్నారావు, శాంసన్, సాంబశివరావు, రవికుమార్, సంపత్, మహేందర్ పాల్గొన్నారు.

కాంగ్రెస్ పెద్దపల్లి ఎంపీ టికెట్ మార్చాల్సిందే

సుల్తానాబాద్: కాంగ్రెస్ పెద్దపల్లి ఎంపీ అభ్యర్థి గడ్డం వంశీ కృష్ణ పేరును మార్చి మాదిగలకే కేటాయించాలని కాంగ్రెస్ నాయకులు, మాదిగ సంఘం నాయకులు కోరారు. గురువారం ఢిల్లీలో మాదిగ ఐక్యవేదికతోపాటు పలు సంఘాల నాయకులు, కాంగ్రెస్ నాయకులు ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. డప్పు కొడుతూ నిరసన తెలిపారు. కాంగ్రెస్ సీనియర్ నాయకుడు ఉట్ల వరప్రసాద్‌కే టికెట్ కేటాయించాలని కోరారు. జేఏసీ, మాదిగ రాజకీయ వేదిక, మాదిగ దండోరా నాయకులు పాల్గొన్నారు.

వారసంతలో సౌకర్యాల కల్పనకు కృషి

ఓదెల: ఓదెలలో ప్రతి గురువారం జరిగే వారసంతలో సౌకర్యాల కల్పనకు కృషిచేస్తానని కరీంనగర్ క్లస్టర్ నాబార్డు ఏజీఎం జయప్రకాశ్ పేర్కొన్నారు. గురువారం ఓదెల వారసంతను ఆయన సందర్శించారు. వారసంతలో చిరువ్యాపారుల సౌకర్యార్థం గద్దెల నిర్మాణాలను కొనసాగిస్తానన్నారు. వారసంత కోసం స్థలం కేటాయించనున్నట్లు చెప్పారు. ఓదెల మాజీ ఎంపీటీసీ చిన్నస్వామి ఉన్నారు.

కార్మికుల సొంతింటి కల నెరవేర్చాలి



వినతిపత్రం అందజేస్తున్న జనక్‌ప్రసాద్

గోదావరిఖని: సింగరేణి కార్మికుల సొంతింటి కల నెరవేర్చాలని ఐఎన్‌టీయూసీ సెక్రటరీ జనరల్ జనక్‌ప్రసాద్ అన్నారు. గురువారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో సంస్థ సీఅండ్‌ఎండీ ఎన్.బలరాంను కలిసి వినతిపత్రం అందజేశారు. కొత్త బొగ్గుగనులు ఏర్పాటు చేసి సింగరేణివ్యాప్తంగా నూతన ఉద్యోగాల కల్పన కోసం కృషి చేయాలన్నారు. వీటికి సీఅండ్‌ఎండీ సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు. ఈ ఆర్థిక సంవత్సరంలో అత్యధిక ఉత్పత్తి సాధించేందుకు కృషిచేసిన సింగరేణీయులను సీఅండ్‌ఎండీ అభినందించారు. అనంతరం ఐఎన్‌టీయూసీ జాతీయ అధ్యక్షుడు డాక్టర్ జి.సంజీవరెడ్డి, రాష్ట్ర మంత్రి శ్రీధర్‌బాబు, రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్‌ను అన్ని ఏరియాల డివిజన్ ఉపాధ్యక్షులతో కలిశారు. రాష్ట్ర కనీస వేతన బోర్డ్ చైర్మన్‌గా నియమించడంలో కృషిచేసినందుకు కృతజ్ఞతలు తెలిపారు. ఆయన వెంట నాయకులు నర్సింహారెడ్డి, ధర్మపురి పాల్గొన్నారు.

మదర్‌థెరిసా కాలేజీలో ముగిసిన టెక్నికల్ వర్క్‌షాప్

పెద్దపల్లిరూరల్: పెద్దపల్లిలోని మదర్ థెరిస్సా ఇంజనీరింగ్ కాలేజీలో టాస్క్ ఆధ్వర్యంలో నిర్వహించిన మూడురోజుల వర్క్‌షాప్ గురువారం ముగిసింది. ప్రోగ్రామింగ్ ఇన్ ఎసెన్షియల్ ఇన్ పైథాన్ జాంగో అనే అంశంపై రిసోర్స్ పర్సన్ రత్నప్రియ విద్యార్థుల సందేహాలకు సమాధానాలిచ్చా రు. ప్రిన్సిపాల్ శ్రీనివాస్, అకౌంట్స్ ఆఫీసర్ పవన్‌కుమార్, ప్లేస్‌మెంట్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు ఉన్నారు.

విగ్రహ ప్రతిష్ఠాపన మహోత్సవం


పూజలు చేస్తున్న అర్చకులు

జ్యోతినగర్: శ్రీభూలక్ష్మి, మహాలక్ష్మి దేవి సహిత బొడ్రాయి ప్రాణప్రతిష్ఠాపన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. గురువారం రామగుండం కార్పొరేషన్ మూడో డివిజన్ మేడిపల్లిలో బొడ్రాయి ప్రాణ ప్రతిష్ఠను అర్చకులు కందుకూరి సతీశ్ పూజలు చేసి విగ్రహ ప్రతిష్ఠ చేశారు. కార్పొరేటర్ కుమ్మరి శ్రీనివాస్, సంపత్‌రావు, శ్రీనివాసరావు, మడ్డి శ్రీనివాస్‌గౌడ్ పాల్గొన్నారు.

కష్టపడ్డ వారికి పార్టీ గుర్తింపు

సుల్తానాబాద్: బీజేపీ కోసం కృషిచేసిన వారిని గుర్తించి జాతీయ ఎస్సీ కమిషన్ మెంబర్‌గా వడ్డేపల్లి రాంచందర్‌ను నియమించిందని బీజేపీ పట్టణ అధ్యక్షుడు రాజన్న అన్నారు. గురువారం ఆయన నివాసంలో కలిసి సన్మానించినట్లు తెలిపారు. రాంచందర్ మాట్లాడుతూ పార్టీ కోసం నిబద్ధతతో పనిచేసిన వారికి గుర్తింపు ఉంటుందన్నారు.

యంత్రాలను పూర్తిస్థాయిలో వినియోగించాలి


యంత్రాలను పరిశీలిస్తున్న ఈఅండ్‌ఎం డైరెక్టర్

గోదావరిఖని: యంత్రాలను పూర్తిస్థాయిలో వినియోగిస్తూ రక్షణతో కూడిన ఉత్పత్తిని సాధించాలని సింగరేణి ఈఅండ్‌ఎం డైరెక్టర్ సత్యనారాయణరావు పేర్కొన్నారు. గురువారం ఆర్జీ–2 ఏరియా ఓసీపీ–3 క్వారీని సందర్శించి పనిస్థలాలను పరిశీలించారు. నైట్ షిఫ్ట్ ఉద్యోగులను కలిసి మెరుగైన ఉత్పత్తి సాధించేందుకు ఉద్యోగులతో మాట్లాడారు. ఆర్థిక సంవత్సరం దగ్గర పడుతున్న క్రమంలో యంత్రాలను పూర్తిస్థాయి పనిగంటలు పనిచేయాలన్నారు. రక్షణతో కూడిన ఉత్పత్తికి ప్రతి ఒక్కరూ పాటు పడాలని ఆదేశించారు. వచ్చే ఆర్థిక సంవత్సరం ప్రణాళిక బద్ధంగా ముందుకు సాగుతూ ఉత్పత్తి లక్ష్యాల సాధనలో అగ్రగామిగా నిలవాలన్నారు. ఆర్జీ–2 జీఎం ఎల్‌వీ సూర్యనారాయణ, ప్రాజెక్టు అధికారి మధుసూదన్, ఏరియా ఇంజినీర్ నరసింహారావు, అధికారులు విజయ్‌కుమార్, రామకృష్ణ ఉన్నారు.

వైభవంగా పోచమ్మతల్లి బోనాలు


కోనరావుపేటలో విగ్రహ ప్రతిష్ఠాపనలో ప్రజలు


లాలపల్లిలో పోచమ్మ బోనాలతో మహిళలు

జూలపల్లి: మండలంలోని కోనరావుపేటలో గురువారం పోచమ్మతల్లి బోనాలు కనులపండువగా నిర్వహించారు. మహిళలు బోనాలతో ఊరేగింపుగా వెళ్లి పోచమ్మ తల్లికి నైవేద్యం సమర్పించి మొక్కులు చెల్లించారు. ఎంపీపీ రమాదేవి, మాజీ సర్పంచ్ కూసుకుంట్ల మంగ పాల్గొన్నారు.

భూలక్ష్మి, శ్రీలక్ష్మి విగ్రహ ప్రతిష్ఠాపన..

పోచమ్మ తల్లి బోనాలను పురస్కరించుకొని గ్రామంలో భూలక్ష్మి, శ్రీలక్ష్మి విగ్రహాలను పంబాల పూజారులు డప్పుచప్పుళ్ల మధ్య పున:ప్రతిష్ఠించారు. బీఆర్‌ఎస్ రాష్ట్ర యువ నాయకులు నల్ల మనోహర్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు చేసి మొక్కులు సమర్పించారు. కూసుకుంట్ల రాంగోపాల్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, రాయమల్లు, అనంతరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పోచమ్మ బోనాలు

ఎలిగేడు: మండలంలోని లాలపల్లిలో రెడ్డి సంఘం ఆధ్వర్యంలో గురువారం పోచమ్మ బోనాలను అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని దాదాపు 130 కుటుంబాల నుంచి ఇంటికో బోనం చొప్పున బైండ్లపూజారుల డప్పు,చప్పుళ్లతో గ్రామంలోని ప్రధానవీధుల గుండా ర్యాలీగా పోచమ్మ ఆలయానికి తరలివెళ్లి బోనాలు చెల్లించారు. రెడ్డి సంఘం అధ్యక్షుడు బద్దం మల్లారెడ్డి, సభ్యులు అశోక్‌రెడ్డి, తిరుమల్‌రెడ్డి, లచ్చిరెడ్డి, మల్లారెడ్డి, హనుమంత్‌రెడ్డి, తిరుపతిరెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, రవీందర్‌రెడ్డి, కిషన్‌రెడ్డి, శ్రీనివాసరెడ్డి, నాయకులు గుర్రం మల్లారెడ్డి, కల్లెం శ్రీనివాసరెడ్డి, రాజేశ్వర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ సింగిరెడ్డి ఎల్లవ్వ పాల్గొన్నారు.

అవయవదానంపై అవగాహన ఉండాలి


అభినందన పత్రం అందజేస్తున్న ప్రతినిధులు

కోల్‌సిటీ: ప్రతి ఒక్కరూ అవయవదానంపై అవగాహన కలిగి ఉండాలని సదాశయ ఫౌండేషన్ ప్రతినిధులు రఘుపతిగౌడ్, కే.ఎస్.వాసు అన్నారు. గోదావరిఖని మార్కండేయ కాలనీకి చెందిన ఆరె రమేశ్ అనే లెక్చరర్ ఇటీవల కిడ్నీ సంబంధిత వ్యాధితో మృతి చెందాడు. కాగా ఆయన నేత్రాలను మరో ఇద్దరికి చూపును ప్రసాదించడానికి కుటుంబ సభ్యులు దానం చేశారు. ఈ సందర్భాన్ని పురస్కరించుకుని గురువారం మార్కండేయ కాలనీలో నేత్రదాత రమేశ్ సంస్మరణ సభను సదాశయ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్వహించారు. నీలవేణికి సదాశయ అభినందన పత్రాన్ని ఫౌండేషన్ ప్రతినిధులు అందజేశారు. నేత్రదాత సోదరులు శ్రీనివాస్, సతీశ్, సోదరి కనకదుర్గ, బావమరిది రెవెళ్లి రాజేశ్ పాల్గొన్నారు.

ఘనంగా పంచలోహ విగ్రహ ప్రతిష్ఠాపన


విగ్రహ ప్రతిష్ఠాపనలో పాల్గొన్న భక్తులు

యైటింక్లయిన్‌కాలనీ: రామగుండం కార్పొరేషన్ యైటింక్లయిన్‌కాలనీలోని శ్రీభక్తాంజనేయ స్వామి దేవాలయంలో గురువారం శ్రీసీతారామ, లక్ష్మణ, సహిత హనుమాన్ పంచలోహ ఉత్సవ విగ్రహ చర ప్రతిష్ఠతో పాటు నవగ్రహ విగ్రహ ప్రతిష్ఠాపన ఘనంగా నిర్వహించారు. ఆలయ అర్చకులు సౌమిత్రి సుమంత్ కుమారాచార్యుల ఆధ్వర్యంలో వేదపండితులు హోమం, మహాపూర్ణాహుతి, కుంభ ఉద్వాసన, శ్రీసీతారామ లక్ష్మణ హనుమాన్‌స్వామి నేత్ర ఉన్మీలనం, నవగ్రహ ప్రతిష్ఠ, 108 శత కలశాభిషేకం (కుంభాభిషేకం) శాంతి కల్యాణం వైభవంగా నిర్వహించారు. అనంతరం తీర్థ ప్రసాదాలు అందజేసి మధ్యాహ్నం మహా అన్నదానం చేశారు. ఆలయ కమిటీ సభ్యులు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

కాంట్రాక్ట్ కార్మికులకు జీవో 22ను అమలు చేయండి

యైటింక్లయిన్‌కాలనీ: సింగరేణిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు జీవో నెంబర్ 22ను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే గెజిట్ చేసి అమలు చేయాలని సింగరేణి కాలరీస్ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ ఐఎఫ్‌టీయూ రాష్ట్ర ఉపాధ్యక్షుడు బి.అశోక్ డిమాండ్ చేశారు. గురువారం ఆర్జీ–2 ఏరియా యైటింక్లయిన్‌కాలనీలోని వివిధ జోన్లలో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ కార్మికులతో నిర్వహించిన సమావేశంలో మాట్లాడారు. 2016లో సుప్రీం తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనాలు చెల్లించాలని కోరారు. రాష్ట్ర ప్రభుత్వం కాంట్రాక్ట్ కార్మికులకు కనీస వేతనాలు పెంచేలా చర్యలు తీసుకోవా లన్నారు. గట్టయ్య, రాయమల్లు, పోషం, విజయలక్ష్మి, రవికుమార్, సమ్మయ్య, శంకరమ్మ పాల్గొన్నారు.

ఆర్థికసాయం అందజేత

పాలకుర్తి: మండలంలోని బామ్లానాయక్‌తండా గ్రామానికి చెందిన యువతి వివాహానికి గ్రామ మాజీ సర్పంచ్ బదావత్ రాజునాయక్ ఆర్థిక సాయం చేశారు. గ్రామానికి చెందిన బదావత్ చందర్–కమల దంపతుల రెండో కుమార్తె వివాహం గురువారం జరగగా హాజరైన రాజునాయక్ దంపతులు రూ.10వేలు అందజేశారు.

ఓటుహక్కును సద్వినియోగం చేసుకోవాలి

కాల్వశ్రీరాంపూర్: ఓటు హక్కు కలిగిన ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని సాంస్కృతిక సారథి కళాబృందం సభ్యులు జనగామ రాజనర్సు, ఈదునూరి పద్మ, బుర్ర శంకర్‌గౌడ్ అన్నారు. గురువారం మండలంలోని తెలుగుపల్లెలో ఓటుహక్కుపై అవగాహన, పరిసరాల పరిశుభ్రత, బేటీ బచావో బేటీ పడావో కార్యక్రమం నిర్వహించారు. కొండ్రా వెంకన్నగౌడ్, ఇల్లందుల మల్లేశంగౌడ్, సలేంద్ర రాజన్న, జిన్నా రమ, కన్నూరి రేణుక, శ్రీవల్లి పాల్గొన్నారు.

బల్దియాలో సెలవుల్లో కూడా బిల్లుల స్వీకరణ

కోల్‌సిటీ: రామగుండం నగరపాలక సంస్థ కార్యాలయంలో సెలవు రోజుల్లోనూ బిల్లులు స్వీకరించే కౌంటర్లు పని చేస్తాయని మున్సిపల్ కమిషనర్ సీ.హెచ్.శ్రీకాంత్ తెలిపారు. ఈనెల 29న గుడ్ ఫ్రైడే, 31న ఆదివారం ప్రభుత్వ సెలవు దినాలైనప్పటికీ ఆస్తి పన్ను, నల్లా బిల్లులు, ట్రేడ్ లైసెన్స్ రుసుములు ఆయా రోజుల్లో నగరపాలక సంస్థ కార్యాలయంలో చెల్లించవచ్చని పేర్కొన్నారు. బిల్ కలెక్టర్లు కూడా సెలవు దినాల్లోనూ విధులకు హాజరై వసూలు చేస్తారన్నారు. ఆస్తి పన్ను బకాయిలపై విధించిన వడ్డీలో 90శాతం మాఫీ పథకం గడువు మార్చి 31తో ముగియనున్న నేపథ్యంలో, ఈ అవకాశాన్ని ఎక్కువ మంది బకాయదారులు ఉపయోగించుకోవాలనే సదుద్దేశంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కమిషనర్ కోరారు.

చేసిన సేవలే చిరస్థాయిగా నిలుస్తాయి


సన్మానిస్తున్న అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్

రామగిరి: ప్రతి ఉద్యోగికి ఉద్యోగ విరమణ తప్పనిసరి అని, చేసిన సేవలే చిరస్థాయిగా నిలిచిపోతాయని జిల్లా అడిషనల్ కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ తెలిపారు. గురువారం సెంటనరీకాలనీ జేఎన్టీయూ కళాశాలలో ట్రస్మా జిల్లా అధ్యక్షుడు అబ్బు కేశవరెడ్డి ఆధ్వర్యంలో మండల విద్యాధికారి పల్లెపాటి సంపత్‌రావు ఉద్యోగ విరమణ సందర్భంగా ఆత్మీయ సన్మాన కార్యక్రమం నిర్వహించారు. జిల్లా విద్యాశాఖ అధికారి డి.మాధవి, జేఎన్టీయూ ప్రిన్సిపాల్ చెరుకు శ్రీధర్‌రెడ్డి, ట్రస్మా అడ్వయిజర్ యాదగిరి, బర్ల శ్రీనివాస్, రంజిత్‌రెడ్డి, శ్రీధర్ పాల్గొన్నారు.